ప్రచురణ తేదీ : 04-13-2019 రచయిత పేజీని సమర్పించినవారు:______

# కాళీపట్నం రామారావు

**ముం**దు ముందు ఎందరి దృష్టినో ఆకర్షించే సంఘటనైనా జరిగేటప్పుడు దాని ప్రాధాన్యతను గ్రహించలేము. అతి సామాన్యంగా జరిగిపోతుంది. ఆనాడు జగన్నాథస్వామి ఆలయంలో జరిగిన సంఘటన కూడా అలాంటి వాటిలో ఒకటి.

సుదర్శనం యువకుడు. పట్నంలో బి.ఎ. పరీక్షకు కూర్చున్నాడు. ఫలితాల కోసం ఎదురుచూస్తూ స్వగ్రామంలో ఉన్నాడు. వయసు మిగిలాక చదువులో ప్రవేశించడం వల్ల విద్యార్థే అయినా విద్యార్థిలా కనిపించడు.

ఆ ఉదయం కాలక్షేపం కోసమే అతడు ఆలయానికి వెళ్ళాడు. అప్పటికే కొందరక్కడ చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంత సేపటికవి రాజకీయాల మీదకీ నడిచాయి.

రాజకీయాలు చర్చించటమంటే పార్టీలనూ ప్రభుత్వాలనూ తత్సంబంధీకులనూ దుమ్మెత్తి పోయటమే. పట్టణాల్లో అయినా పల్లెల్లో అయినా రాజకీయ చర్చలు రాజకీయ చర్చలే.

ఆసరికి కాంగ్రెస్‌ను తూర్పార బట్టడం జరిగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోసేశారు. నెహ్రూ చేతకానితనం గూర్చి వాపోవడం ముగిసింది. కథ కమ్యూనిస్టుల మీదికి మళ్లింది. కమ్యూనిజం యొక్క అమానుషత్వం గురించి చర్చ సాగుతోంది.

పట్టణాల్లో చదువుకున్న వాళ్ళలోనే యిలాంటి తెలిసీ తెలియని వాళ్ళు చాలా మందుంటారు. అలాంటి వాళ్ళను చూస్తే సుదర్శనానికి

ఒళ్ళు మంట. అయితే – మరీ భరించలేనప్పుడు తప్ప వాళ్లను ప్రతిఘటించడు.

పార్టీలో మెంబర్‌షిప్ లేకపోయినా సుదర్శనానికి ఆ పార్టీ పట్ల సానుభూతి ఉంది. కమ్యూనిస్టులను విమర్శించినా అతడు సహించగలడు గాని వాళ్ళ సిద్ధాంతం తప్పుడు సిద్ధాంతమంటే అతడు తట్టుకోలేడు.

ఆరోజు అక్కడ చేరిన వాళ్లలో ఎవరు ఏం వాగినా అతడు ఖాతరు చేయకపోను. బుచ్చిలింగం కూడా వాళ్లతో గొంతు కలుపుతుంటే అతడు ఓర్చుకోలేక పోయాడు.

బుచ్చిలింగం పరిస్థితులు ఒకప్పుడు బాగానే ఉండేవి. ఆపదలకూ ఆడపిల్లల పెళ్ళిళ్ళలకూ అప్పులుచేసి వడ్డీలతోనూ వడ్డీలకు వడ్డీలతోనూ కోర్టు ఖర్చులతోనూ అవి పెరిగిపోగా భూమీ పుట్రా సమస్తం పోయి ఇప్పుడు తిండికి కూడా కష్టపడుతున్నాడు.

అందుకని–

"నీకు కమ్యూనిజాన్ని గురించి ఏం తెలుసని దానిని విమర్శిస్తా వయ్యా?" అన్నాడు వీలైనంత సౌమ్యంగానే.

బుచ్చిలింగం వయసున చాలా పెద్దవాడైనా పల్లెటూరి సాంప్రదాయాల ననుసరించి ఏకవచన ప్రయోగం సభ్యతా దూరం కాదు.

సుదర్శనం సవాలు అందరి దృష్టినీ ఆకర్షించింది.

కొంత గొడవ తరువాత కమ్యూనిజం గురించి అతడు చెప్పడానికీ తక్కిన వాళ్లు వినడానికీ అంగీకారం కుదిరింది.

పార్టీ రాజకీయాల మీద చర్చ వెనక్కి వాయిదా వేసి సిద్ధాంతం ఎందుకు పుట్టిందో అదేమంటుందో ముందు చెపుతానన్నాడు సుదర్శనం. అతడేం చెప్పినా దానిని ఖండించడమే వాళ్ల లక్ష్యం కాబట్టి – "సరే! అదే చెప్పు"– అన్నారు.

ఈ దేశంలోనే కాక దాదాపు అన్ని దేశాల్లోనూ తినడానికి ఉన్న వాళ్ళు తక్కువా తిండి లేని వాళ్లే చాలా చాలా ఎక్కువ! ఈ పరిస్థితి ఎలా వచ్చిందో చెప్పి – పెట్టుబడి, పెట్టుబడిదారీ ఉత్పత్తి, మిగులుశ్రమ వంటి పారిభాషిక పదాలను వివరిస్తూ పట్టణాల్లో పెద్దపెట్టున సాగే పారిశ్రామిక దోపిడీ గురించి క్లుప్తంగా చెప్పి పల్లెల్లో సాగే భూస్వామ్య దోపిడీ గురించి చెపుతున్నాడు. ఇంతలో అక్కడకు సూరప్పడు వచ్చాడు.

అతడు రాగానే అక్కడున్న వాళ్లంతా – 'ఏం అన్నా! ఏం బావా! ఏం దద్దీ! ఏవండీ!' అంటూ వరసగా పలకరింపుల్లో పడ్డారు. అతడు అందరికీ అన్ని వరసల్లోనూ జవాబిచ్చి "మీరేదో మాటాడుకుంటున్నారు కావాల! మాటాడుకోండి. మాటాడుకోండి" అంటూ ఆలయం లోపలికి వెళ్లిపోయాడు. సుదర్శనం ఆపినచోట ఎత్తుకొని ముందుకు పోతున్నాడు.

ఆ ఊళ్లో సంపన్నులందర్లోకీ సంపన్నుడు సూరప్పడు. మనిషి మాత్రం అలా కనిపించడు.

ముతక ఖద్దరు గావంచా ఒకటి కట్టుకొని పై మీద ఒక తువాలుతో అప్పుడప్పుడే పైబడుతున్న ముసలి రూపుతో తల వంచుకొని తన పనుల మీద తిరుగుతుంటాడు. మనిషెంత నిరాడంబరుడో మాటంత మృదువు. పని పడితే తప్ప పలకరింపులకు మించి మాటాడడు.

అతడు భగవంతుణ్ణి నమ్ముతాడు. పాపమంటే భయం. పుణ్యకార్యాల పట్ల ఆసక్తి ఉన్నవాడు. ఆవాళ శనివారమని కాబోలు – పొత్తిగావంచా కట్టుకొని, చేతిలో పూజా ద్రవ్యాల పళ్లెం పట్టుకొని, భుజాన తడి అంగ వస్త్రంతో, నుదట తిరునామాలతో దేవాలయం కొచ్చాడు. ఆలయంలో అర్చకులు కనిపించకపోగా ప్రాకారంలోనే ఉన్న ఆయన యింటికి వెళ్లాడు. అక్కడ నుండి వచ్చాక సావిడిలో సాగుతున్న గోష్ఠి వింటున్నాడు.